క్లుప్తంగా

రేపటి నుంచి సీఎంకప్ క్రీడాపోటీలు

గద్వాల రూరల్: ఈనెల 15వ తేదీ నుంచి గద్వాల మండలంలోని అన్ని గ్రామాల్లో సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రవీందర్ ప్రకటనలో తెలిపారు. 15ఏళ్ల నుంచి 35ఏళ్ల వయసున్న ఆసక్తి గల క్రీడాకారులు పోటీలలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పురుషులకు వాలీబాల్, కబడ్డీ పోటీలను మహిళలకు ఖోఖో పోటీలను నిర్వహిస్తున్నట్లు, పూర్తి వివరాలకు 9966925127, 9440551182 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

అనాథ పిల్లలకు రూ.లక్ష సాయం

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో తల్లి దండ్రులను కోల్పోయిన ముగ్గురు అనాథ పిల్లలకు యువ ప్రగతి సంఘం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి రూ.లక్ష నగదును శనివారం ఫిక్స్ డిపాజిట్ చేశారు. ఈమేరకు చెక్కును పిల్లలకు అందివ్వడం ఆనందంగా ఉందని సంఘం అధ్యక్షుడు బజారి తెలిపారు. కంచుపాడు సర్పంచు శేషన్ గౌడు, నరేష్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన కాశపోగు నాగమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోతురాజు శంకరమ్మ సేవాదళం సభ్యులు గ్రామానికి చేరుకొని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ. 5000 ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సేవాదళం సభ్యులు దేవన్న, రాజు, స్వాములు, నాగరాజు, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

ఎర్రవల్లిచౌరస్తా: మండలంలోని ఉదండాపురం గ్రామానికి చెందిన వివాహిత శుక్రవారం సాయంత్రం ఇంట్లో నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోకారి తెలిపారు.

ఉచిత వైద్య పరీక్షలు

గట్టు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం సర్పంచ్ ధనలక్ష్మి, ఉప సర్పంచ్ సుజాతమ్మ ప్రారంభించి మాట్లాడారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెల్త్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరూ పంచాయతీ దగ్గర ఆరోగ్య పరీక్షలను చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు సత్యనారాయణ, గ్రామస్తులు రంగస్వామి, దేవన్న, గోపాల్, బుడ్డన్న తదితరులు పాల్గొన్నారు.

కురుమ యాదవుల ఆత్మీయ సమ్మేళనం

మానవపాడు: మండలంలోని జల్లాపురంలో శనివారం గొల్ల, కురుమల ఆత్మీయ సమ్మేళనాన్ని గొర్రెల కాపరుల సంఘం గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కి ఒక్కో లబ్ధిదారుడు రూ. 43750 ఖాతాలో జమ చేసుకోవాలన్నారు. ఒక్కో యూనిట్ 20 గొర్రెలు, ఒక పొటేలు అందజేస్తుందన్నారు. ప్రభుత్వం రూ.75వేలు భరిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి

గద్వాల న్యూటౌన్: గద్వాల మండలంలోని సంగాలలో ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త అయ్యపురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు గోపూజ, 8:30 గంటలకు పంచామృతాభిషేకం, 9.00 గంటలకు పవన హోమం, 12 గంటలకు లక్ష పుష్పార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

కేటీదొడ్డి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఈ నెల 15న సోమవారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో 2వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహీద్దీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంలో నవంబర్ 1 వ తేదీ 2020 సంవత్సరం నుంచి 31 మార్చి 2023 వరకు జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఎన్నికల్లో పోటీ చేస్తా



అయిజ: అలంపూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తానని ఆశయ సాధన సమితి వ్యవస్థాపకుడు రాములు దయాల్ అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీచర్ ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయ ప్రవేశం చేస్తానన్నారు. ఏ పార్టీ ఆదరించినా ప్రజా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించొద్దు



మల్దకల్ ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ



నందిన్నె మన గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

కేటీదొడ్డి: నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ వెంకటేష్ హెచ్చరించారు. శనివారం మండలంలోని నందిన్నెలోని గ్రోమోర్ కేంద్రంతో పాటు ప్రైవేట్ ఎరువుల దుకాణంలో రిజిస్టర్లను ఆయన తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని యజమానులకు సూచించారు. నకిలీ ఎరువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కానిస్టేబుల్ జ్యోతి కాంత్, రజిని తదితరులు ఉన్నారు.

మల్దకల్: ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్, ఎస్‌ఐ శేఖర్‌లు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు పొందాలన్నారు. అంతకు ముందు ఆయన మల్దకల్‌లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ ఖజాపాషా తదితరులు పాల్గొన్నారు.

గట్టు: ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాల విక్రయించాలని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, ఎస్‌ఐ పవన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలలో రిజిస్టర్లను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న ఎరువులు, క్రిమి సంహారక మందులు, విత్తనాల గురించి అధికారులు దుకాణ యజమానులను అడిగి తెలుసుకున్నారు.

వీఓఏలకు బీమా సౌకర్యం కల్పించాలి



మల్దకల్ ఆందోళన చేస్తున్న వీఓఏలు



గట్టులో నిరసన తెలుపుతున్న వీఓఏలు

గట్టు: మండల మహిళా సమాఖ్య ఎదుట శనివారం వీఓఏ నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా వీఓఏలకు ప్రభుత్వం రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీఓఏలు సురేష్, వీరేష్‌గౌడ్, మహాదేవ్‌గౌడ్, నాగరాజు, భాస్కర్, తిరుమలేష్, ప్రకాష్, మునేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మల్దకల్: వీఓఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం మండల నాయకులు బాషా, చంద్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల మహిళా సమాఖ్య భవనం ఎదుట వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో వీఓఏల సంఘం శంకర్‌గౌడ్, తిమ్మప్ప, గోవిందు, లోకనాథ్, మునిస్వామి, హనుమంతు, వెంకట్రాములు, అపర్ణ, నవీన, ఏస్తేర్, తిరుమలేష్, మహేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బంగారు భవిష్యత్



విద్యార్థులతో బీఆర్‌ఎస్ నాయకులు

అయిజ: క్రీడాకారులకు బంగారు భవిష్యత్ ఉంటుందని బీఆర్‌ఎస్ నాయకుడు భూంపురం నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని భూంపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు యూత్ గేమ్స్ నేషనల్ ఛాంపియన్స్‌లో ఎనిమిది మంది బంగారు పతకాలు, నాలుగు సిల్వర్ పతకాలు సాధించడంతో శుక్రవారం రాత్రి పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన వైజీసీ గేమ్స్‌లో పాఠశాల విద్యార్థులు వివిధ భాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. వచ్చే నెల నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులకు ఆర్థికసహకారం అందిస్తామని వేద గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆకులబాబు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ భరత్ భరద్వాజ రెడ్డి, హెడ్ మాస్టర్ భీమేశ్వర్‌రెడ్డి, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

ధరూరు: కేంద్ర ప్రభుత్వం వెంటనే నిత్యావసర ధరలు తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. 'బీజేపీకో హఠావ్.. దేశకో బచావ్' నినాదంతో ఇంటింటికి సీపీఐ ప్రజా పోరు యాత్రలో భాగంగా ఆయన శనివారం సాయంత్రం మండలంలోని మన్నాపురం, గుడ్డెందొడ్డి, మాల్‌దొడ్డి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ముఖ్య కూడళ్లలో గ్రామస్తుల ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను అప్పనంగా అప్పజెప్పుతోందని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్, సిలిండర్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరిసిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కర్రెప్ప, బీఆర్‌ఎస్ వినోద్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు చెన్నయ్య, వెంకటేష్, జిల్లా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గట్టు: కేంద్ర ప్రభుత్వం పెరుగుతున్న ధరలను అదుపు చేయక పోవడంతో సామాన్యులపై పెను భారం పడుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు ఆరోపించారు. ఇంటింటికి సీపీఐ ప్రజా పోరులో భాగంగా శనివారం తుమ్మలచెరువు, గొర్లఖాన్‌దొడ్డి గ్రామాల్లో సీపీఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో కర్రెప్ప, వినోద్, చెన్నయ్య, వెంకటేష్, కాసీం, జిల్లా సభ్యులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో నిర్లక్ష్యం



మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి వెంకటస్వామి

గద్వాల అర్బన్: ప్రభుత్వం రైతుల నుంచి సరైన సమయంలో ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రతి ఎకరాలకు రూ.20వేలు పరిహారం చెల్లించాలని, వర్షాలకు తడిసిన ప్రతి ధాన్యపు గింజను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు వీవీ నర్సింహ, రేపల్లే దేవదాస్, రాజు, పరంజ్యోతి, నర్మద, ఉప్పేరు నర్సింహ్మ, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

సైబర్‌నేరాలపై అవగాహన



ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న సీఐ సూర్యనాయక్

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయిలో గ్రామస్తులకు శనివారం సీఐ సూర్య నాయక్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. షీ టీం, పోలీస్ కళాబృందం భరోసా టీం సభ్యులు అతివేగం, బాల్యవివాహాల కలిగే నష్టాలను వివరించారు. డయల్ 100 ప్రాముఖ్యత, మహిళల భరోసా కేంద్రం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సూర్య నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. మొత్తం 37 మంది 70 ఇళ్లను తనఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి ధ్రువపత్రాలు లేని 27 బైక్‌లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, బాలరాజు, వెంకటస్వామి, పాల్గొన్నారు.

అలంపూర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయండి

ఉండవెల్లి: అలంపూర్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతూ తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను కలుగోట్లకు చెందిన యూత్ ఫర్ పబ్లిక్ రాష్ట్ర అధ్యక్షుడు శేషు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని టూరిజం డెవలప్‌మెంట్ కార్యాలయంలో కలిసి అలంపూర్ నియోజక వర్గంలోని అలంపూర్ పుణ్యక్షేత్రాన్ని అనివిధాలా పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరారు. బీచుపల్లిలోని ఆంజనేయ స్వామి ఆలయం, నిజాం కొండా, సుంకేసుల డ్యాం మధ్యలో ఉన్న ఐలాండ్, అయిజలో ఉన్న వినసంపురం ఐలాండ్ అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు.

16 నుంచి శిక్షణ తరగతులు



గద్వాల అర్బన్: ప్రజానాట్య మండలి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రజానాట్యమండలి గాయకులకు పాటల శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ మండలి జిల్లా అధ్యక్షుడు అలీ అక్బర్, గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా నుంచి ప్రజా నాట్య మండలి గాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఆశన్న తదితరులు ఉన్నారు.

విధుల్లో చేరిన కార్యదర్శులు

మానవపాడు: మండలంలోని విధులు నిర్వహిస్తున్న 12 జూనియర్ పంచాయతీ కార్యదర్శులు 02 ఇద్దరు జేపీఎస్ పంచాయతీ కార్యదర్శులు శనివారం ఎంపీఓ ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న కార్యదర్శులు, జేపీఎస్‌లు విధులకు హాజరవుతున్నట్లు వివరించారు.

పట్టు వస్త్రాల అందజేత

శాంతినగర్: మండలంలోని జూలెకల్ గ్రామానికి చెందిన నాయక వెంకటరాజు, పద్మావతి దంపతుల కుమార్తె దేవి వివాహ వేడుకలను శనివారం వడ్డేపల్లి మున్సిపాలిటీ శాంతినగర్ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నారాలోకేష్, బ్రాహ్మణి దంపతులు ఆడబిడ్డ పెళ్లి కానుకగా రాష్ట్ర టీడీపీ కార్యాలయం నుంచి పట్టణ కార్యాలయానికి పట్టు వస్త్రాలు పంపించారు. ఈ మేరకు మండల నాయకులు పెళ్లికూతురు పట్టువస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు ఉప్పల పూర్ణచందర్‌రావు, సాయి చాణక్య, మమత, గోపాల్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలోనూ ఆగని ఆత్మహత్యలు



గద్వాల రూరల్: నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలోనూ ఆత్మహత్యలు ఆగడం లేదని బీజేపీ నాయకులు విమర్శించారు. వరంగల్ జిల్లా రంగాపురం జేపీఎస్ బైరీ సోని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేపథ్యంలో గద్వాలలో శనివారం రాత్రి బీజేపీ నాయకులు ఆమె ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జేపీఎస్‌లను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, వెంకట్రాములు, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గద్వాల అర్బన్: వరంగల్ జిల్లాలో రంగాపురం గ్రామానికి చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శి బైరీ సోని పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని, ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బహుజనసేన జిల్లా అధ్యక్షుడు దానయ్య డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాముడు, కృష్ణ, అజయ్, విజయ్, రాజు, సంజీవ తదితరులు ఉన్నారు.



మృతిచెందిన మూగజీవాలు

విద్యుత్ తీగే.. యమ పాశమైంది

ఒక నిర్లక్ష్యం.. ఐదు మూగజీవాల ప్రాణాలు బలిగొంది. కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయకుండా వదిలేయడంతో నిమిషాల వ్యవధిలోనే నాలుగు గేదెలు, ఒక ఆవు ఆ విద్యుత్ తీగలను తగిలి మృతిచెందాయి. కేటిదొడ్డి మండల కేంద్రంలో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా... గ్రామానికి చెందిన కుర్వ సురేష్, మూకప్పలు రోజులానే గేదెలను తమ పొలం వద్ద మేతకు తీసుకెళ్లారు. మేత మేసే క్రమంలో కిందకు వేలాడుతున్న తీగలు తగిలి నాలుగు గేదెలు, ఆవు అక్కడికక్కడే మృతి చెందాయి. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు తెలిపారు. ఒక్కో గేదె విలువ రూ.60 వేలు ఉంటుందని మొత్తం రూ.3 లక్షలు నష్టపోయామ ని బాధితులు వాపోయారు. విషయం తెలుసుకున్న మండల పశువైద్యాధికారి వినయ్, గోపాల్‌మిత్ర వెంకటేష్ పంచనామా నిర్వహించారు. – కేటీదొడ్డి

రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శం



రేషన్‌దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వీఎం అబ్రహం

మానవపాడు: రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం నిలుస్తున్నాయని ఎమ్మెల్యే వీ ఎం అబ్రహం అన్నారు. శనివారం మండలంలోని చండూరులో రేషన్ దుకాణాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన పంచాయతీ చట్టం ద్వారా గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహులు, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, హుస్సేన్, కాంతారెడ్డి, అనంతేశ్వర్‌రెడ్డి, నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: స్వయంభూ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారి అభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తులు స్వామి వారికి దాసంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, ఈఓ సత్యశ్చంద్రారెడ్డి నాయకులు మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రావు, బాబురావు, ఆలయ సిబ్బంది ఉరుకుందు, శ్రీను, రంగస్వామి, శివమ్మ, కృష్ణ తదితరులు ఉన్నారు.

తిమ్మప్ప స్వామి ఆలయంలో..

అయిజ: పట్టణ సమీపంలోని కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు, సింగిల్ విండో ప్రెసిడెంట్ మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ దేవస్థానం నుంచి ఆర్‌అండ్‌బీ గద్వాల రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. జెడ్పీటీసీ నిధుల నుంచి సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతునట్లు పేర్కొన్నారు. నిధుల విడుదలకు కృషి చేసిన జెడ్పీ చైర్ పర్సన్ సరిత, జెడ్పీటీసీ సభ్యురాలు పుష్పమ్మకు కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



శాంతినగర్ క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్



నారాయణపురంలో విజయసంకేతం చూపుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

శాంతినగర్: కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడంతో శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయం ఎదుట నాయకులు పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మిఠాయిలు పంచుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు నాగశిరోమణి, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు ఎనుముల నాగరాజు, ఆయా మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజోళి: కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ విజయం సాధించడంపై ఆ పార్టీ నాయకులు మండలంలో పటాకులు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ నియంతృత్వ ధోరణితో ప్రజలు విసిగిపోయారని రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, హసన్, కుమార్, సంధ్యాబాబు, శంకర్ నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని రాజీవ్ గాంధీ సర్కిల్‌లో కాంగ్రెస్ నాయకులు పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కర్ణాటక మాదిరి తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నరెందర్ నాయుడు, నాగేష్, నాయకులు నాగరాజు, నర్సన్ గౌడ్, రాజు రెడ్డి, రమేష్, బుచ్చిరెడ్డి, లక్ష్మిరెడ్డి, వెంకటేశ్వర్లు, నయీం, తదితరులు పాల్గొన్నారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాలలో కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపుపై కార్యకర్తలు సంబరాలు జరుకున్నారు. ఈ సందర్భంగా పటాకులు కాల్చుతూ, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ సాధించడంతో ఇటిక్యాల మండల నాయకులు సంబరాలను చేసుకున్నారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి ఆధ్వర్యంలో నాయకులు ఎర్రవల్లి కూడలిలలో పటాకులు కాల్చి ఒకరికొకరు మిఠాయిలను తినిపించుకొని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, రాజు, వెంకటన్న, జగన్నాథం, బాషా, ఎల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

బీఎస్పీ నాయకుల ఆందోళన



మిట్టదొడ్డి స్టేజీ దగ్గర ఆందోళన చేస్తున్న బీఎస్పీ నాయకులు

గట్టు: రోడ్లు దెబ్బతిని ప్రయాణించేందుకు కూడా వీలులేకుండా ఉండటంతో శనివారం బీఎస్పీ నాయకులు ఆందోళన చేపట్టారు. శనివారం కర్నూలు–రాయచూర్ అంతర్రాష్ట్ర రహదారి మిట్టదొడ్డి స్టేజీ దగ్గర రోడ్డుపై నాయకులు బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్పీ గద్వాల నియోజక వర్గ అధ్యక్షుడు బల్గెర రాజు, ఆల్‌ఇండియా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు మాచర్ల ప్రకాష్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని ఆరోపించారు. గద్వాల నియోజక వర్గంలో రోడ్లు సక్రమంగా లేవని, దెబ్బతిన్న రోడ్లు, అసంపూర్తి రోడ్ల కారణంగా వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నా, పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు మణికుమార్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ఎర్రవల్లి చౌరస్తాలో ప్రభుత్వ వైఖరిపై ఆయన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మొండి వైఖరి, నియంత విధానాలతో కార్యదర్శులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రంగాపురం కార్యదర్శి సోనిది ముమ్మాటికి ప్రభుత్వ హత్యేనని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, సేతురాజు, బీసన్న, సురేష్ కుమార్, తదితరులు ఉన్నారు.

మానవపాడు: ప్రభుత్వ విధానాలతోనే జూనియర్ పంచాయతీ కార్యదర్శి మృతి చెందిందని ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యేనని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ ఎంజీ కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని చెన్నిపాడులో ఆయన పర్యటించారు. జేపీఎస్‌ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి మృతికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.